సాక్షి వనపర్తి

సోమవారం, 23, అక్టోబర్, 2023



తస్మాత్ జాగ్రత్త!
దసరా పండుగకు చాలామంది సొంతూళ్లకు వెళ్లడంతో చోరీలు జరిగే ప్రమాదం ఉంది.
వివరాలు IIలో ▸



ప్రకృతి వ్యవసాయమే..
సేంద్రియ సాగుకు రైతులు ఆసక్తి చూపాలని పలువురు అభిప్రాయపడ్డారు.
వివరాలు IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /20.3

వాతావరణం
మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. అర్ధరాత్రి చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.



దుర్గాదేవి నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆత్మకూర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో సహస్ర కుంకుమార్చన, హోమం, పల్లకీసేవ, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు. - ఆత్మకూర్

న్యూస్‌రీల్

అన్నిరంగాల్లో పురోభివృద్ధి



పెబ్బేరు రూరల్: దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి ఉన్నతస్థానంలో నిలిచిందని జెడ్పీ చైర్మన్ ఆర్.లోకనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయదశమి మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా జెడ్పీచైర్మన్, ముఖ్యవక్తగా పాలమూరు విభాగ్ పత్తికొండ రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. కరోనాతో అన్ని దేశాలు నేటికీ కోలుకోలేని స్థితిలో ఉంటే భారత్ టీకా ఇచ్చి ఆదుకుందని.. ఆర్థికంగా 5వ స్థానంలో నిలిచిందన్నారు. ముఖ్యవక్త పత్తికొండ రాంరెడ్డి మాట్లాడుతూ.. భారతీయులు ఎప్పుడూ యుద్ధ వ్యతిరేకులు, శాంతికాములేనని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాఘవేందర్, తిరుప్పాజి, అమర్, కురుమూర్తి, మధు పాల్గొన్నారు.

36 కిలోల వెండి, రూ.లక్ష సీజ్



పాన్‌గల్: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో 36 కిలోల వెండి (రూ.26.25 లక్షల విలువ) ఆభరణాలు, రూ.1.01 లక్షల నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. కొల్లాపూర్ నుంచి వనపర్తికి వెళ్తున్న కారును తనిఖీ చేయగా వెండి, నగదు పట్టుబడ్డాయని.. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆధారాలు చూపిస్తే తిరిగి అందజేస్తామని వివరించారు.



ఊరించి.. ఉసూరుమనిపించి

ఎట్టకేలకు బీజేపీ తొలి జాబితా విడుదల

- ఉమ్మడి పాలమూరు నుంచి ఇద్దరికే ఖరారు
- కల్వకుర్తిలో ఆచారి, కొల్లాపూర్‌లో సుధాకర్‌రావుకు చాన్స్
- మిగతా 12 స్థానాల అభ్యర్థులపై సస్పెన్స్
- నిరుత్సాహంలో ఆశావహులు
- ఎందుకిలా.. ఏం జరుగుతోందని శ్రేణుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరువ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే కమలనాథులు ఎవరనే ఉత్కంఠ నాలుగైదు రోజులుగా నెలకొన్న విషయం తెలిసిందే. ఎట్టకేలకు భారతీయ జనతా పార్టీ తొలి జాబితాను ఆదివారం వెల్లడించగా.. ఉమ్మడి జిల్లాలో కేవలం రెండు స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించారు. నేడు.. రేపు.. మాపు ఇదిగో జాబితా అంటూ ఊరిస్తూ వచ్చి.. చివరకు ఉసూరుమనిపించడంపై ఆ పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం అలుముకుంది. అధికార బీఆర్‌ఎస్ ముందస్తుగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఉన్న 14 స్థానాల్లోనూ అభ్యర్థులను ప్రకటించి.. 13 మందికి బీఫాంలు అందజేసింది. కాంగ్రెస్ సైతం ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేయగా ఆయా పార్టీలు ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. అయినా అభ్యర్థిత్వాలు తేల్చకుండా బీజేపీ అధిష్టానం జాప్యం చేసేలా వ్యవహరిస్తున్న తీరుపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గట్టి పోటీ ఇచ్చేవారు లేక..

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి అభ్యర్థులే లేకపోవడం.. మరో కొన్ని సెగ్మెంట్లలో ఇద్దరు, ముగ్గురు నేతలు టికెట్ ఆశిస్తున్నప్పటికీ ప్రత్యర్థులను ఢీకొట్టగలిగే స్థితిలో లేకపోవడం.. రెండు స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉన్న నేతలు అసెంబ్లీ బరిలో నిలిచేందుకు విముఖత చూపుతుండడంతో బీజేపీ అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గెలిచే అవకాశం ఉన్న కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల అభ్యర్థులకు తొలి జాబితాలో అవకాశం కల్పించి.. మిగతా 12 స్థానాలను పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది.

కల్వకుర్తి, కొల్లాపూర్‌లో త్రిముఖ పోరు..

జంగ్ తెలంగాణ

బీజేపీ నుంచి కల్వకుర్తిలో తల్లోజు ఆచారి, కొల్లాపూర్ నుంచి ఎల్లేని సుధాకర్‌రావు ఎన్నికల బరిలో నిలవనున్నారు. ఆయా సెగ్మెంట్లల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సైతం ఇది వరకే అభ్యర్థులను ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా స్థానాల్లో ప్రధానంగా త్రిముఖ పోరు కొనసాగనున్నట్లు స్పష్టమవుతోంది. కొల్లాపూర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి (బీఆర్‌ఎస్), మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు (కాంగ్రెస్), ఎల్లేని సుధాకర్‌రావు (బీజేపీ) మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించి భంగపడిన చింతలపల్లి జగదీశ్వర్‌రావు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బీఫాం తీసుకుని పోటీలో ఉండనున్నట్లు ప్రకటించారు. అయితే ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరి.. ఆ పార్టీ గెలుపునకు సహకరిస్తానని ప్రకటించారు. మరోవైపు కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి (కాంగ్రెస్), సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ (బీఆర్‌ఎస్), తల్లోజు ఆచారి (బీజేపీ) మధ్య హోరాహోరీగా పోరు సాగనున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కల్వకుర్తి నియోజకవర్గం



పూర్తి పేరు : తల్లోజు ఆచారి
భార్య : తల్లోజు గీత
కుమార్తె : తల్లోజు పావని
కుమారుడు : తల్లోజు భరత్
పుట్టిన తేదీ : 06.06.1966
స్వగ్రామం : ఆమనగల్ (రంగారెడ్డి జిల్లా)
చదువు : బీఏ (ఈపీపీ)
రాజకీయ ప్రస్థానం: మొదటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్న ఆచారి 1980లో బీజేపీ అనుబంధ విభాగమైన ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1983లో ఆమనగల్ వార్డు సభ్యుడిగా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. 1991లో ఆమనగల్‌లోని సూర్యలత స్పిన్నింగ్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడిగా మొదటిసారిగా ఎన్నికై .. ఇప్పటికీ కొనసాగుతున్నారు. 1994లో మొదటిసారి కల్వకుర్తి ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. 1995లో ఆమనగల్ మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1994, 2004, 2009, 2014, 2018 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో 78 ఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి వంశీచంద్‌రెడ్డి చేతిలో, 2018 ఎన్నికల్లో సైతం 3 వేల పైచిలుకు ఓట్ల తేడాతో జైపాల్‌యాదవ్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2019లో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా మూడేళ్లపాటు కొనసాగారు.

కొల్లాపూర్ నియోజకవర్గం



పేరు : ఎల్లేని సుధాకర్ రావు
స్వగ్రామం : మహాసముద్రం, పెద్దకొత్తపల్లి
పుట్టిన తేదీ : 04.02.1968
విద్యార్హత : ఎంబీఏ
భార్య : భారతి
పిల్లలు : ఇద్దరు కుమార్తెలు తేజస్విని, రిష్విత
రాజకీయాల్లోకి రాకముందు: విద్యుత్ శాఖలో ఏఈ నుంచి డీఈఈ వరకు బాధ్యతలు నిర్వహించారు. టీఎస్‌రెడ్కో స్థాపించాక వైస్ చైర్మన్‌గా, ఎండీగా పనిచేశారు.
రాజకీయ అరంగేట్రం : మొదటి నుంచీ ఆర్‌ఎస్‌ఎస్‌లో పలు బాధ్యతల్లో పనిచేశారు. 2018 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. ఆ ఎన్నికల్లో పోటీ చేసి 13,186 ఓట్లు సాధించారు.

కాంగ్రెస్ పూర్తి జాబితా ప్రకటించిన తర్వాతే..

కాంగ్రెస్‌లో తొలి విడతలో ఎనిమిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఈ క్రమంలో ఆ పార్టీలో పలు నియోజకవర్గాల్లో అసమ్మతి పెల్లుబికింది. ప్రధానంగా నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, గద్వాలలో అసంతృప్త జ్వాలలు ఎగసిపడ్డాయి. మిగిలిన ఆరు సెగ్మెంట్లలోనూ హస్తం నుంచి ఒక్కో స్థానానికి ఇద్దరు, ముగ్గురికి మించి పోటీపడుతున్నారు. అక్కడ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత జరిగే పరిణామాలను గమనించి బీజేపీ రెండో విడత జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌లో టికెట్ ఆశించి భంగపడిన ముఖ్య నేతలను బీజేపీలోకి ఆహ్వానించి.. పార్టీ టికెట్ ఇస్తారనే చర్చ కమలం శ్రేణుల్లో జోరుగా సాగుతోంది.

ఇథనాల్ చిచ్చు..

కంపెనీ విష వ్యర్థాల పారబోతపై గ్రామస్తుల ఆందోళన



ఎక్లాస్‌పూర్- చిత్తనూరు శివారులో ఘర్షణ పడుతున్న పోలీసులు, గ్రామస్తులు

- పోలీసుల లాఠీచార్జ్.. ఎదురుదాడికి దిగిన గ్రామస్తులు
- పోలీసు వాహనం, రెండు బైక్‌లకు నిప్పు
- సీఐ, ఎస్‌ఐ, ఐదుగురు కానిస్టేబుళ్లకు గాయాలు
- కంపెనీ వాహనాల అద్దాలు ధ్వంసం

మరికల్: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్‌లో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. జూరాల ఆగ్రో ఇథనాల్ కంపెనీ వ్యర్థాలను ఎక్లాస్‌పూర్, జిన్నారం, చిత్తనూర్, చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామాల శివారుల్లో పారబోస్తుండడంతో అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఓ ట్యాంకర్ వ్యర్థాలను నింపుకొని బయటికి రావడాన్ని గమనించిన గ్రామస్తులు.. ఎక్లాస్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద అడ్డుకున్నారు. ఇథనాల్ కంపెనీని మూసివేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. 16 గంటలపాటు ఆత్మకూర్ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పోలీసులు నచ్చజెప్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం తహసీల్దార్ సునీత అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ నెల 25న ఆర్డీఓ సమక్షంలో కంపెనీని పరిశీలిస్తామని చెప్పినా వినలేదు. ట్యాంకర్‌లో ఉన్న కెమికల్‌ను పరీక్షించే వరకు ఆందోళన విరమించేది లేదని గ్రామస్తులు భీష్మించారు. నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ ఆదేశాల మేరకు మరికల్, మక్తల్, నర్వ, ధన్వాడ పోలీసులతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు రంగంలోకి దిగారు. గ్రామస్తులపై లాఠీచార్జ్ చేయడంతో పలువురికి గాయాలవగా.. పొలాల వెంబడి గ్రామస్తులు పరుగులు పెట్టారు. ఇదే సమయంలో ఇథనాల్ కంపెనీ ట్యాంకర్‌ను పోలీసుల బందోబస్తు మధ్య తరలించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. పోలీసులపై ఎదురుదాడికి పాల్పడ్డారు. రాళ్లు, ఇటుకలు, కర్రలతో దూసుకురావడంతో అక్కడి నుంచి ప్రాణాలతో బయట పడేందుకు పోలీసులు పరుగులు పెట్టారు. మక్తల్ సీఐ రాంలాల్‌ను వ్యవసాయ పొలాల్లో వెంబడించి తీవ్రంగా గాయపర్చారు. గాయపడిన మరికొందరు పోలీసులు పక్కనే ఉన్న నరసింహస్వామి ఆలయ గదిలోకి వెళ్లారు. అనంతరం అరెస్ట్ చేసిన ఆందోళనకారులను వదిలిపెట్టి, గదిలో ఉన్న పోలీసులను విడిపించుకున్నారు.

ప్రాణం పోయినా.. పట్టువదలం



ఇక్కడి నుంచి కంపెనీ ఎత్తివేసే వరకు తమ పోరాటం ఆగదు. ఇథనాల్ కంపెనీ నుంచి ప్రమాదం కలిగించే కెమికల్స్‌ను గ్రామ శివారులో వేయడం వల్ల దుర్వాసన వస్తోంది. వ్యర్థాలను తరలించే ట్యాంకర్‌ను అడ్డుకొని శాంతియుతంగా ధర్నా చేస్తుంటే పోలీసులు దాడిచేసి గాయపర్చారు. అక్కడి నుంచి పరుగు తీసినా వదిలిపెట్టలేదు. మా ప్రాణాలు పోయినా పర్వాలేదు.. కంపెనీని తొలగించే వరకు ఆందోళన చేస్తాం.
– హన్మమ్మ, మానస, ఎక్లాస్‌పూర్

కాలు విరగొట్టారు..



పోలీసులు కర్రలతో కొట్టడంతో కాలు విరిగిపోయింది. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాల నుంచి తమకు ప్రాణహాని ఉందని రెండేళ్ల నుంచి ఆందోళన చేస్తున్నాం. పిల్లలు, వృద్ధులు అని కూడా చూడకుండా పోలీసులు కొట్టడం వల్ల చాలామంది గాయపడ్డారు. ఇంకా కంపెనీని రద్దు చేసే వరకు నిద్రపోం.
– చంద్రమ్మ, జిన్నారం



దగ్ధమవుతున్న పోలీసు వాహనం

డీఎస్పీదే బాధ్యత

ఇథనాల్ కంపెనీ నుంచి బయటకు తెచ్చి పారబోస్తున్న విష రసాయనాల ట్యాంకర్‌ను అడ్డుకొని ఆందోళన చేస్తున్న గ్రామస్తులపై పోలీసులను రెచ్చగొట్టి లాఠీచార్జీ చేయించిన డీఎస్పీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు చక్రవర్తి ఒక ప్రకటనలో అన్నారు. కంపెనీ నుంచి 15 రోజులుగా ట్యాంకర్ల ద్వారా వ్యర్థాలు తీసుకొచ్చి జిన్నారం, ఎక్లాస్‌పూర్, చిత్తనూర్, ఉంద్యాల తదితర గ్రామాల రహదారుల పక్కన పారపోయడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. దీనిపై తహసీల్దార్‌తో మాట్లాడుతుండగా డీఎస్పీ పోలీసులను రెచ్చగొట్టి లాఠీచార్జీ చేయించారని, ఇందుకు ఆయనే బాధ్యత వహించాలని చెప్పారు.

‘విజయ’మే..!

నేడు దసరా పండుగ

- జిల్లాకేంద్రంలో రాజవంశీయుల సమక్షంలో వేడుకలు
- శమీవృక్షాల రచ్చకట్ట ముస్తాబు
- గతేడాది నుంచి నల్లచెరువు కట్టపై..





రాజాగారి బంగ్లాలో ఆదివారం పూజలు నిర్వహిస్తున్న రాజా కృష్ణదేవరావు

వనపర్తిటౌన్: తరాలు మారినా.. నేటికీ జిల్లాలో పెద్దలు చూపిన మార్గంలోనే దసరా వేడుకలు కొనసాగుతున్నాయి. జిల్లాకేంద్రంలో రాజవంశీయుల కాలం నుంచి ఉత్సవాల వన్నె తగ్గలేదు. వివిధ ప్రాంతాల్లో నివసించే ఈ ప్రాంత ప్రజలు ఈ పండుగకు మాత్రం స్వగ్రామాలకే రావడం విశేషం.

వనపర్తిలో సంస్థానాధీశుల కాలం నుంచి రాజవంశీయుల సారథ్యంలో వేడుకలు జరుపుకోవడం విశేషంగా చెప్పవచ్చు. దివంగత రాజా రామేశ్వర్‌రావు కాలంలో వనపర్తి రాజ ప్రసాదంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి రెండు ఏనుగులు, గుర్రాలతో ఆయుధాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఒకప్పటి పట్టణ శివారు (ప్రస్తుత పాత పట్టణం) జమ్మిచెట్టు చౌరస్తా వద్ద శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరికీ జమ్మి వితరణ చేసేవారు. కాలం మారినా.. రాజుల పాలన అంతమైనా... నేటికీ దసరా పండుగ నాడు వనపర్తి ప్రజలు రాజవంశీయుల రాకకోసం ఎదురుచూస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. సంస్థానాధీశుల వారసుడు రాజా కృష్ణదేవరావు నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు బంగ్లాలో ఉండి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆయా రోజుల్లో రామాయణ పారాయణం చేస్తూ పండుగకు ఒకరోజు ముందు ఘనంగా ఆయుధ పూజ నిర్వహిస్తారు.

కులవృత్తుల వారు సైతం..

రాజులకాలంలో ఏయే కులవృత్తుల వారు ఏమేమి చేసేవారో ఇప్పటికీ అదే ఆనవాయితీ కొనసాగుతుంది. పండుగరోజు శ్రీరామ పట్టాభిషేకం పారాయణం ముగిస్తారు. అనంతరం ఆయుధాలతో శమీ వృక్షం వద్దకు రాజవంశీయులు వచ్చే సమయంలో ఆయుధాలకు కాపలాగా ఉండేందుకు విశ్వబ్రాహ్మణులు బేతాళుడిని తయారుచేసి రాజ మండపానికి తీసుకెళ్తారు. బేతాళుడి సంరక్షణలో ఆయుధాలతో దళితుల డప్పువాయిద్యాల నడుమ నాటి బ్రాహ్మణ వంశీయులతో కలిసి రాజా కృష్ణదేవరావు గోపాల్‌పేట రహదారిలోని జమ్మిచెట్టు వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు జమ్మి వితరణ చేస్తారు.

హిందు, ముస్లింల ఐక్యతకు నిదర్శనం..

రాజుల కాలం నుంచి కూడా హిందు ముస్లింలు వేడుకల్లో పాల్గొంటారు. శమీ రేకులను ఒకరికొకరు ఇచ్చుకొని ఆలింగనం చేసుకొని పండుగా శుభాకాంక్షలు చెబుతారు.

గతేడాది నుంచి నల్లచెరువుపై..

రహదారి విస్తరణలో గోపాల్‌పేట రహదారిలోని జమ్మిచెట్టును అధికారులు గతేడాది తొలగించారు. ఆ ప్రాంతానికి కొద్దిదూరంలో ఉన్న మినీ ట్యాంక్‌బండ్‌గా రూపుదిద్దుకున్న నల్లచెరువుపై శమీవృక్షం నాటి రచ్చకట్ట నిర్మించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నివర్గాలను ఒప్పించి అక్కడే పూజలు చేయించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. దీంతో గతేడాది తరహాలోనే ఈసారి కూడా రాజవంశీయులు పూజలు చేయనున్నారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి.. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాతే ప్రజల జీవన విధానంలో మార్పులొచ్చాయని.. ప్రస్తుతం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.15 లక్షలకు పెరిగిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో అన్నిరంగాలను సమానంగా అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని చెప్పారు. వ్యవసాయంలో దేశంలోనే అగ్రగామిగా ఉన్న పంజాబ్‌లాంటి రాష్ట్రాల్లో కూడా పెట్టుబడి సాయం అందించడం లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ అభివృద్ధి పని ప్రారంభించినా ఏళ్ల కాలం చేసి ప్రజాధనం వృథా చేసేవారని.. జూరాల ప్రాజెక్టును మూడున్నర దశాబ్దాల పాటు నిర్మించారని గుర్తుచేశారు. కాళేశ్వరం, పాలమూరు లాంటి ప్రాజెక్టులు రికార్డుస్థాయిలో ఏడేళ్లలో పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. హామీ ఇస్తే ప్రభుత్వ కాలపరిమితి ఐదేళ్లలోపు పూర్తిచేసేలా ఉండాలని కేసీఆర్ నిరూపించారన్నారు. ఈ నెల 26న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభకు సీఎం కేసీఆర్ రానున్నారని.. చేయాల్సిన అభివృద్ధి పనులపై హామీ సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరు ప్రమోద్‌రెడ్డి, నాయకులు నందిమళ్ల అశోక్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- ఎస్పీ రక్షిత కె.మూర్తి



ఆయుధ పూజలో ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: దుర్గామాత ఆశీస్సులతో పోలీసు యంత్రాంగం ఉత్తమ సేవలు అందించి ప్రజలతో ప్రశంసలు పొందాలని ఎస్పీ రక్షిత కె.మూర్తి చెప్పారు. ఆదివారం స్థానిక సాయుధదళ పోలీసు కార్యాలయంలో ఆమె ఆయుధాలు, పోలీసు వాహనాలకు పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించుకునే విజయదశమిని జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో చెడును పారదోలేందుకు పోలీసు విభాగం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సాయుధ దళాధిపతులు శ్రీనివాస్, అప్పలనాయుడు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలు..

జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రక్షిత కె.మూర్తి, మహిళా పోలీసులు, వివిధ సంఘాల మహిళలతో పాటు కలెక్టర్ కుటుంబసభ్యులు, ఎస్పీ కుటుంబ సభ్యులు సంబరాల్లో పాల్గొని ఆడిపాడారు. అనంతరం బతుకమ్మను తలపై ఉంచుకొని నిమజ్జనానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులతో పాటు ఎస్‌ఐ ఇందిర, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్పీ కార్యాలయ మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలోకి వర్కటం


వర్కటం జగన్నాథ్‌రెడ్డిని బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

మక్తల్: నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదివారం బీఎస్పీలో చేరారు. ఆదివారం మెట్టుపల్లిలో జరిగిన బీఎస్పీ బహిరంగ సభలో రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో వర్కటంతో పాటు అంజనారెడ్డి పార్టీలో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆర్‌ఎస్పీ మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థిగా వర్కటం జగన్నాథ్‌రెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు దయానంద్‌రావు, విజయ ఆర్యా కసాక్తరియా పాల్గొన్నారు.


టీచర్లకు ఆర్డర్లు జారీ


ఆర్డర్ కాపీల పంపిణీపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: శాసన సభ ఎన్నికల నేపథ్యంలో విద్యాశాఖలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ నిమిత్తం ఆర్డర్లు జారీ చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 1,798 మందితో పాటు ఇతర అధికారులు 1,722 మంది ఉన్నారు. మొత్తం 3,520 మందికి ఎన్నికల శిక్షణ కోసం ఆర్డర్లను జారీ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదివారం ఎంఈఓలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. ఉపాధ్యాయులు సోమవారం ఉదయం 11 గంటలలోగా ఆర్డర్లను తీసుకోవాలని తెలిపారు. ఆర్డర్ కాపీలు తీసుకొని వారి వివరాలను సాయంత్రం 4 గంటలలోగా అందజేయాలని సూచించారు. ఆర్డర్ కాపీలు తీసుకున్న ఉపాధ్యాయులకు ఈనెల 27, 28 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సమాచారం.

తస్మాత్ జాగ్రత్త!

- తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు
- పండుగకు ఊరెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి
- ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్న పోలీస్‌శాఖ



మహబూబ్‌నగర్ క్రైం: దసరా పండగ, సెలవుల నేపథ్యంలో పట్టణాల నుంచి చాలా మంది స్వగ్రామాలకు వెళ్తుంటారు. ప్రతి ఒక్కరి దృష్టి పండుగ మీద ఉంటుంది. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. ఈ సీజన్‌లో చాలా మేర చోరీ కేసులు నమోదవుతాయి. ఇటీవల తాళం వేసి ఉన్న ఇళ్లపై దొంగలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నారు. రోజురోజుకూ నేరగాళ్ల సంఖ్య పెరుగుతుండటంతో వారిని గుర్తించడం పెద్ద తలనొప్పిగా మారింది.

జాగ్రత్తలు పాటించాలి..

- ఎక్కువ రోజులు ఊరెళ్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.
- ప్రధాన ద్వారాలకు కాకుండా ఇతర ద్వారాలకు తాళం వేసి, మిగతా వాటికి లోపలి భాగంలో తాళం వేయాలి. అలా వేయడంతో ఇంట్లోని వాళ్లు ఊరు వెళ్లారనే అనుమానం చోరులకు రాకుండా ఉంటుంది.
- ఇంట్లో లేకున్నా గదుల్లో విద్యుత్ దీపాలు వేసి ఉంచాలి. దీంతో పాటు తాళం వేసిన ద్వారాలకు పరదాలు వేస్తే కనబడకుండా ఉంటాయి.
- విలువైన ఆభరణాలు, నగదు వెంట తీసుకెళ్లాలి. లేకుంటే బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.
- రాత్రివేళ ఒంటరిగా వెళ్లాల్సి వస్తే మహిళలు తక్కువ ఆభరణాలు ధరించాలి. అవసరం అయితే భుజం పైనుంచి కొంగు కప్పుకొని వెళ్లడం మరింత శ్రేయస్కరం.
- ఊరెళ్లే ముందు ద్విచక్ర వాహనాలు ఆరుబయట, ప్రహరీ లోపల, ఇంటి ముందు పెట్టి వెళ్లకూడదు. వాహనానికి జాగ్రత్తగా తాళం వేసి సుపరిచితుల ఇళ్లలో పెట్టి పోవడం చాలా మంచిది.
- సెలవుల్లో కుటుంబ సభ్యులు ఊరెళ్లినప్పుడు ఆభరణాలకు రంగులు, మెరుగులు అద్దుతాం అంటూ ఇళ్లకు వచ్చే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు వచ్చిన వారి ప్రాంతం, వారి గుర్తింపు కార్డులు పరిశీలన చేయడం మంచిది.
- మహిళలు ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఇల్లు, గదుల అద్దె కోసం వచ్చిన వారికి లేవని చెప్పడమే మంచిది.
- అనుమానాస్పద వ్యక్తులు కాలనీల్లో సంచరిస్తుంటే 100కు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

గస్తీ ముమ్మరం..

సెలవుల్లో చాలా మంది వివిధ ప్రాంతాలు, స్వగ్రామాలకు ఎక్కువగా వెళ్లే వారి ప్రాంతాలు, కాలనీల్లో గస్తీని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది. జిల్లా కేంద్రంలో ఉన్న మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్, రక్షక్‌లతో రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ నిర్వహించాలి. రోజు పలు బీట్లు ఏర్పాటు చేసుకొని బృందాలుగా తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ప్రజలు అత్యవసర సమయంలో 100 లేదా పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలి.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

దొంగతనాలు ఎక్కువ జరిగే (క్రైం జోన్) ఏరియాల్లో పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ గస్తీ పెంచుతాం. సెలవులు పూర్తయ్యే వరకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తాం. వేరే ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి ప్రధాన డోర్‌కు లోపలి నుంచి తాళం వేసి, లోపల ఒక లైట్ వెలిగే విధంగా చూడాలి. ప్రధానంగా విలువైన వస్తువులు బంగారం, నగదు ఇంట్లో పెట్టరాదు. జిల్లా కేంద్రంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న కాలనీలను గుర్తించడం జరిగింది. వాటిని హాట్‌స్పాట్ కిందకు చేర్చి ప్రత్యేక నిఘా పెడుతున్నాం.

– టి.మహేష్, డీఎస్పీ, మహబూబ్‌నగర్

ప్రకృతి వ్యవసాయమే శ్రీరామ రక్ష


కోటకదిరలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరి పంటను పరిశీలిస్తున్న రైతులు

మహబూబ్‌నగర్ రూరల్: రసాయనిక పంటలకు స్వస్తి పలికి సేంద్రియ వ్యవసాయాన్ని చేసేందుకు రైతులు ముందుకు రావాలని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. ఆదివారం మండలంలోని కోటకదిరకి చెందిన రైతు జ్ఞానేశ్వర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. జ్ఞానేశ్వర్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రాన్ని ఇతర రైతులకు చూయించి సేంద్రియ వ్యవసాయం పద్ధతులపై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. రసాయనిక పంటల ఆహారాన్ని ఉపయోగించడం ద్వారా అనేక రోగాలు సంక్రమిస్తున్నాయని, ప్రకృతి సేద్య ఆహారాన్ని ఔషధంగా స్వీకరిస్తే మనిషి ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ 'సేద్య సందర్శనకు రండి, అనుభవాలు పంచుకుందాం' పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జ్ఞానేశ్వర్‌రెడ్డి తాను పండిస్తున్న సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మోహన్ ధాన్య పేరిట నామకరణం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు జయచంద్రమోహన్, ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ నమిలే రాంమోహన్, సేంద్రియ వ్యవసాయ రైతులు శ్రీహరి, మహిపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, అచ్యుతారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రాజు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి సమన్వయకర్తగా ఉపాధ్యాయుడు గుముడాల చక్రవర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా రైతులకు, ప్రకృతి ప్రేమికులకు సేంద్రియ ఆహార ఉత్పత్తులతో చేసిన ఆహారాన్ని ఏర్పాటు చేశారు.

దసరా కేరాఫ్ పాలమూరు

- ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 40 ఏళ్ల నుంచి నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు
- ఈ ఏడాది మినీ ట్యాంక్‌బండ్ వద్ద వేడుకలు


గతేడాది జెడ్పీ మైదానంలో దసరా సంబరాలను తిలకిస్తున్న ప్రజలు (ఫైల్)

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా సంబరాలకు పాలమూరు పట్టణం కేరాఫ్‌గా నిలుస్తోంది. ప్రతి ఏడాది ఇక్కడ జరిగే దసరా పండుగ వేడుకలు ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్నాయి. దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 40 ఏళ్ల నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. మొదట 19 ఏళ్ల టీడీగుట్ట ప్రాంతంలో ఉత్సవాలు నిర్వహించారు. 21 ఏళ్ల నుంచి జెడ్పీ మైదానంలో దసరా వేడుకలు జరుగుతుండగా.. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకే తలమానికమైన మినీ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది దసరాకు సంబంధించి ధ్వజధారిని నిర్ణయిస్తారు. ఈసారి ధ్వజధారిగా కండె కుమారస్వామి వ్యవహరిస్తున్నారు. ముందుగా పండుగ రోజు ఆర్యసమాజం మందిరంలో ఉదయం 8 గంటలకు దేవయజ్ఞం, వేదోపదేశం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు అక్కడి నుంచి కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా బయలుదేరుతారు. ధ్వజధారి ధ్వజాన్ని ధరించి 3 గంటలకు రాంమందిర్ చౌరస్తాలోగల దసరా కట్ట దగ్గర జనసమ్మేళనం నిర్వహిస్తారు. ఈ ఏడాది పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించడానికి దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

పురవీధుల గుండా ర్యాలీ..

ఉత్సవ జెండాతో పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపడుతారు. పాన్‌చౌరస్తా ద్వారా వచ్చిన భారీ ర్యాలీకి రామయ్యబౌలి (రైతు మార్కెట్) వద్ద ఖౌమీ ఏక్తా కమిటీ ఆధ్వర్యంలో కులమతాలకతీతంగా పలువురు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ర్యాలీ ట్యాంక్‌బండ్ వద్దకు వద్దకు చేరుకుంటుంది. దసరాను పురస్కరించుకొని మినీ ట్యాంక్‌బండ్ వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం పలు అస్త్రాల పేరుతో ఏర్పాటు చేసిన రంగురంగుల టపాసులను పేల్చగా ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకలను తిలకిస్తారు.

వైభవంగా నిర్వహిస్తాం..

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వి.మురళీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.ముత్యాల ప్రకాశ్ అన్నారు. ఈ ఏడాది కూడా వేడుకలను మినీ ట్యాంక్‌బండ్‌లో జరుపుతున్నామని, ప్రత్యేక సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఉంటాయని వారు పేర్కొన్నారు.

ఆదర్శం.. 'ఖౌమి ఏక్తా'

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని ఖౌమి ఏక్తా కమిటీ కులమతాలు, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోంది. పట్టణంలో అన్ని మతాల పండుగల్లో కులమతాలకతీతంగా శుభాకాంక్షలు తెలపాలనే ఉద్దేశంతో 1981 సంవత్సరంలో అధ్యక్షుడిగా షాబుద్దీన్ ఖాద్రీ, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ఖౌమీ ఏక్తా కమిటీని ఏర్పాటు చేశారు. 1997 నుంచి కమిటీ అధ్యక్షుడిగా భగవంతురావు, ప్రధాన కార్యదర్శులుగా సీనియర్ ఉర్దూ జర్నలిస్టు రఫీక్ పటేల్, ముత్యాల ప్రకాశ్ ఉన్నారు. ప్రస్తుతం ఈ కమిటీకి చీఫ్ ప్యాట్రన్‌గా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యవహరిస్తున్నారు.

పండుగ రోజుల్లో..

మహబూబ్‌నగర్ ఖౌమి ఏక్తా కమిటీ ఉమ్మడి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. హిందువులు అత్యంత వైభవంగా నిర్వహించే దసరా పండుగ రోజు క్లాక్‌టవర్ వద్ద, ముస్లింల రంజాన్, బక్రీద్‌లో ఈద్గా సమీపంలో, మిలాదున్నబీలో అంబేద్కర్ చౌరస్తా, సంబంధించి క్రిస్మస్‌కు ఎంబీ చర్చి ఆవరణల్లో ప్రత్యేక స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తారు. ఆయా పండుగ రోజుల్లో వేదిక వద్దకు చేరుకొని కులమతాలకతీతంగా ప్రజలు పండుగ శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీగా వస్తోంది. రంజాన్, బక్రీద్ వేడుకల్లో ఈద్గా సమీపంలో వేదిక ఏర్పాటు చేయగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతారు. అనంతరం కమిటీ కార్యదర్శి రఫీక్ పటేల్ నివాసంలో ఈద్‌మిలాప్ నిర్వహించి పండుగ స్పెషల్ షీర్‌ఖుర్మా సేవిస్తారు.

గర్వంగా ఉంది..

నేను 30 ఏళ్ల నుంచి ఖౌమీ ఏక్తా కమిటీకి ప్రధాన కార్యదర్శిగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉంది. అన్ని పండుగల్లో కులమతాలు, పార్టీలకతీతంగా ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకోవాలనే ఉద్దేశంతో కమిటీ ఆధ్వర్యంలో స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. ఇలాంటి కమిటీ తెలంగాణలో మరెక్కడా లేదు. ఇది మహబూబ్‌నగర్ ప్రజల ప్రేమ, ఆదరాభిమానాలతో సాధ్యమైంది. – రఫీక్‌పటేల్, ఖౌమి ఏక్తా కమిటీ ప్రధాన కార్యదర్శి

యువతకు నాణ్యమైన విదేశీ విద్య

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో ఉన్నత విద్యతోపాటు స్కాలర్‌షిప్, ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మహబూబ్‌నగర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్న ఫస్ట్ ఎవర్ బిగ్గెస్ట్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్, ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ వన్ విండోను మంత్రి పరిశీలించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన యువత విదేశాల్లో చదువుకోవడానికి శాంతనారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ ప్రతి ఏడాది నిర్వహించేలా చూస్తామన్నారు. మహబూబ్‌నగర్‌కు అంతర్జాతీయ స్థాయి కంపెనీలు వస్తున్నాయని, దీంతో యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు వంశీవినయ్, అంకిత్ జైన్, వివిధ దేశాలకు చెందిన యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మన్యంకొండలో అదనపు కమిషనర్ పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా ఆదివారం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.

జూనియర్ నేషనల్ ఆర్చరీ పోటీలకు విష్ణువర్ధన్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాజస్తాన్ రాష్ట్రం భరత్‌పూర్‌లో వచ్చే నెల 15 నుంచి 22 వరకు జరిగే 43వ ఎన్‌టీపీసీ జూనియర్ నేషనల్ ఆర్చరీ పోటీలకు జిల్లాకేంద్రానికి చెందిన క్రీడాకారుడు విష్ణువర్ధన్ ఎంపికయ్యాడు. రంగారెడ్డి జిల్లా కొల్లూర్‌లో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో విష్ణువర్ధన్ మెరుగైన ప్రదర్శన కనబరిచి రజత పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విష్ణువర్ధన్ గతంలో పలు జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు. విష్ణువర్ధన్ ఎంపికపై జిల్లా ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రామచందర్, కోచ్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో ప్రతిభచాటి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

సాక్షి ఫ్యామిలీ
మహబూబ్‌నగర్
సోమవారం ॥ 23-10-2023

విజయ దశమి ప్రత్యేకం

స్త్రీ శక్తి విజయం విజయ దశమి



ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మా విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ'అవుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్త్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితోపాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్రపోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!

సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభ పెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచననుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మాణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్ఛితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగివేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి,



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును, సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును, ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

శ్రీదేవితోనే యుద్ధం చేయదలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పదిమంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది – రవితేజ



● అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

"'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

"నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా



● 'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక

ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.

అప్పుడే అది జరుగుతుంది

– అల్లు అర్జున్




● దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

"'పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే

– దర్శకుడు రాజ్ మదిరాజు



"ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లి దండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కల్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్టపడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా

– తల్లాడ వెంకన్న



● వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ– ''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



● శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



● ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వీ తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వీ, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా – నిర్మాత సతీష్ కుమార్



"గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.